సాక్షి
కుమురం భీం

ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024



విజేత హైదరాబాద్

వేణుగోపాల్ మెమోరియల్ ఇన్విటేషన్ ఫుట్‌బాల్ పోటీలు శనివారం ముగిశాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో హైదరాబాద్ జట్టు విజయం సాధించింది. 8లో▸



మందుబాబుల అడ్డా..!

కౌటాలలోని మినీ స్టేడియం మందుబాబులకు అడ్డాగా మారింది. నిర్వహణ సరిగా లేక నిరుపయోగంగా మారింది. గేటు విరిగి పశువులు సంచరిస్తున్నాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
39.8 /27.8

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఉపరితల ద్రోణి ప్రభావంతో ఒకటిరెండు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నామినేషన్ పత్రాలతో సక్కు పూజలు



పూజలు చేస్తున్న ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో శనివారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు నామినేషన్ పత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 23న ఆదిలాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం మంగళవారం నిర్వహించే హనుమాన్ జయంతి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అర్చకులు శిరీష్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, వెంకన్న, వివేక్, ప్రదీప్, మధుకర్, శ్రీనివాస్, రాధాకృష్ణచారి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఈ నెల 14న ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాలు శనివారం ముగిశాయి. వారోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఒక్కో ప్రదేశంలో అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ముగింపు రోజు జిల్లా కేంద్రంలోని ఫైర్ స్టేషన్‌లో లీడింగ్ ఫైర్‌మెన్ సంపత్ ఆధ్వర్యంలో పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది నర్సింగ్‌రావు, మహేశ్, రాము, తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

మూడోరోజు నామినేషన్లు నిల్

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో భాగంగా మూడోరోజైన శనివారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. రిటర్నింగ్ అధికారి రాజర్షి షా నిర్ణీత సమయం వరకు తన చాంబర్‌లో నిరీక్షించినప్పటికీ నామినేషన్ వేసేందుకు ఎవరు రాలేదు. ఇప్పటి వరకు కేవలం మూడు నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి. ఆదివారం సెలవు రోజు కావడంతో నామినేషన్ల స్వీకరణ ఉండదు. సోమవారం ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే అవకాశముంది.

నాణ్యతతో పనులు చేపట్టాలి

ఆసిఫాబాద్‌రూరల్: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ బడుల్లో చేపట్టిన పనులు నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శనివారం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, కిచెన్ షెడ్లు, తదితర పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. పనుల పురోగతి ఫొటోలను పోర్టల్‌లో నమోదు చేస్తూ, నివేదిక రూపొందించాలని ఆదేశించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఈవో అశోక్, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'బీజేపీతోనే అభివృద్ధి'



ప్రచారం చేస్తున్న శ్రీనివాస్

కౌటాల(సిర్పూర్): బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. కౌటాల మండల కేంద్రంలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి ఆదిలాబాద్ బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపించాలని కోరారు. నరేంద్ర మోదీతోనే దేశానికి భద్రత అని స్పష్టం చేశారు. పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. మండల ప్రధాన కార్యదర్శి మిథున్, నాయకులు పెద్దపల్లి భీమన్న, నరసింహారెడ్డి, మధుకర్, చందు, బాపురావు, భూమయ్య, తిరుపతి పాల్గొన్నారు.

ఐఏఎస్‌కు ఆమడ దూరం!

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఏటా రాష్ట్రం నుంచి యూపీఎస్సీ(యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) నిర్వహిస్తున్న సివిల్స్ పరీక్ష ఫలితాల్లో సత్తా చాటుతున్నారు. వివిధ వర్గాల నుంచి అభ్యర్థులు దేశ అత్యున్నత స్థాయి ఉద్యోగాలకు ఎంపిక అవుతున్నారు. ఆదివాసీ తెగలు మాత్రం ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్, ఇండియన్ ఫారిన్ సర్వీస్, ఐఎఫ్ఎస్, ఇండియన్ పోలీస్ సర్వీస్(ఐపీఎస్)తోపాటు గ్రూప్ ఏ, బీ కేటగిరీ సర్వీసులకు ఇంకా ఆమడ దూరంలోనే ఉంటున్నాయి. ఉమ్మడి ఏపీ నుంచి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక కూడా ఈ స్థాయికి ఒక్కరూ చేరుకోకపోవడం ఆ వర్గాల వెనుకబాటుతనాన్ని తెలియజేస్తోంది. అదే సమయంలో ఎస్టీ ఇతర ఉపకులాల నుంచి అర్హత సాధిస్తున్నారు. కానీ గోండు, ప్రధాన్, నాయక్‌పోడ్, కోయ, అంధ్ తదితర తెగలతోపాటు పీవీటీజీ(పర్టిక్యులర్లీ వల్నెరెబుల్ ట్రైబల్ గ్రూప్స్) కొలాం, తోటి, కొండరెడ్డి తెగలకు ఈ హోదాలు అందని ద్రాక్షగానే మారాయి.

సండే స్పెషల్



ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు చౌరస్తాలో తొలి ఆదివాసీ ఐఏఎస్ తుకారాం విగ్రహం

- 'సివిల్స్'కు ఆసక్తి చూపని ఆదివాసీలు
- ఉన్నత లక్ష్యం వైపు వెళ్లని అడవి బిడ్డలు
- రాష్ట్రం నుంచి ఏ ఒక్కరికీ దక్కని అవకాశం

రిజర్వేషన్ ఫలాలు ఉన్నా..

రాష్ట్ర జనాభాలో 9శాతంతో 31లక్షలకు పైగా గిరిజనులు ఉండగా, ఇందులో ఆదివాసీ తెగలు 10లక్షలకు పైగా ఉన్నారు. లంబాడా, ఇతర కులాలు 20లక్షలకుపైగా ఉంటారని అంచనా. ఆదిమ తెగలు మాత్రమే సివిల్స్‌కు దూరంగా ఉంటున్నారు. ఎస్టీ అభ్యర్థులకు సివిల్స్‌లో 7.5శాతం కోటా, ఐదేళ్ల వయస్సు సడలింపుతో గరిష్టంగా 37ఏళ్లలో ఎన్ని సార్లయినా పరీక్ష రాసే(ఓబీసీలకు 9, జనరల్ 6సార్లు) అవకాశం ఉంది. కానీ ఆదివాసీ విద్యార్థులు అటు వైపు వెళ్లడం లేదు. 'సివిల్స్' ప్రయాణం అధిక ఖర్చు, సమయంతో కూడుకోవడంతో దూరంగా ఉంటారు. ఇటీవల అవగాహన పెరిగినప్పటికీ కింది స్థాయి ఉద్యోగాలకే పరిమితం అవుతున్నారు. ఆదివాసీ గూడేల్లో తల్లిదండ్రులకు మరింత అవగాహన కల్పించడంతోపాటు ఉన్నత లక్ష్యాలు ఎంచుకునేలా గిరిజన విద్యార్థులను ప్రోత్సహించాలని గిరిజన సంఘాలు కోరుతున్నాయి.

అవకాశాలను అందిపుచ్చుకోలేక

ఆదివాసీలకు విద్య కోసం కేంద్ర, రాష్ట్రాలు రూ.వందల కోట్లు ఖర్చు చేస్తున్నాయి. ఐటీడీఏ పర్యవేక్షణలో ప్రత్యేక స్కూళ్లు ఏర్పాటు చేసి, వసతితో విద్యను అందిస్తున్నాయి. ఇంగ్లిష్ మీడియంలోనూ విద్య అందుతోంది. డిగ్రీ తర్వాత బీఈడీ, బీటెక్, బీఫార్మసీ, మెడిసిన్ వరకు చదువుతున్నారు. కానీ సివిల్స్ లక్ష్యంగా వెళ్లడం లేదు. ఇక గిరిజన సంక్షేమ శాఖ నుంచి హైదరాబాద్‌లో గిరిజనులకు ఉచితంగా సివిల్ సర్వీసెస్ శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణకు ఆదివాసీల అభ్యర్థులు పెద్దగా హాజరుకావడం లేదు. కిందిస్థాయి ఉద్యోగాలైన కానిస్టేబుల్, గ్రూప్–4, గ్రూప్–2, డీఎస్సీ వంటి పోటీ పరీక్షల్లో నెగ్గుతున్నారు. విద్యావంతులు, ఉద్యోగస్తులు, ఆర్థికంగా ఉన్న కుటుంబాల పిల్లలు సైతం ఇటువైపు రావడం లేదు. ప్రస్తుతం కొంతమంది ఆసక్తి చూపిస్తుండడంతో, ఈ తెగల నుంచి భవిష్యత్తులో అఖిల భారత స్థాయి అధికారులుగా చూసే అవకాశం ఉంది.

ఒకే ఒక్క ఐఏఎస్ తుకారాం

ఉమ్మడి రాష్ట్రం నుంచి నేటి దాక ఆదిమ తెగల నుంచి మడావి తుకారాం ఒక్కరే ఐఏఎస్ హోదాకు చేరుకున్నారు. ప్రముఖ ఆంత్రోపాలజిస్టు హైమాన్ డార్ఫ్ స్ఫూర్తితో ఉన్నత విద్యనభ్యసించారు. మొదట అనువాదకుడిగా ఉద్యోగాన్ని ప్రారంభించి క్రమంగా గ్రూప్–1 సర్వీస్‌కు ఎంపికై, తర్వాత ఐఏఎస్ హోదా పొందారు. తుకారాం తర్వాత ఆ హోదాలో ఉన్న ఆదివాసీలెవరూ లేకపోవడం గమనార్హం. ఆయన కాలంలోనే ఆదివాసీలు చదువుకోవాలని అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఏటా నవంబర్ 29న వర్ధంతిని ఆదివాసీలు ఘనంగా నిర్వహిస్తుంటారు.

వెనకబడిపోతున్నారు..



ఆదివాసీల నుంచి ఇప్పటి వరకు నేరుగా ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉద్యోగాలకు ఎవరూ ఎంపిక కాలేదు. కొందరు ఆసక్తితో చదువుతున్నా ఫలితాల్లో వెనకబడిపోతున్నారు. భవిష్యత్తులో ఎంపిక అవుతారని ఆశిస్తున్నాం.

–సిడాం అర్జు పటేల్, సీనియర్ నాయకుడు, గోండ్వానా, గోండ్ మహాసభ

ప్రభుత్వాలు ప్రోత్సహించాలి



ఆదివాసీలకు ఉన్నత స్థాయి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. ఇందుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తూ శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.

– కనకయాదవ రావు, మాజీ చైర్మన్, జిల్లా గ్రంథాలయాల సంస్థ, ఆసిఫాబాద్

ఏ శాఖ చూసినా.. అదే తంతు!

- పలువురు అధికారులపై అవినీతి ఆరోపణలు
- ప్రతీ పనికి కొంత మొత్తం డిమాండ్ చేస్తున్న వైనం
- ఇటీవల ఎస్సై ఏసీబీకి పట్టుబడటంతో మళ్లీ చర్చ
- అవగాహన లేక ఫిర్యాదు చేయని బాధితులు



చింతలమానెపల్లి/కౌటాల: ప్రభుత్వ కార్యాలయాల్లో ఎంతో కొంత ముట్టజెప్పనిదే పని జరగదనే ఆరోపణలు నిత్యం వినిపిస్తున్నాయి. కీలక శాఖలైన రెవెన్యూ, పోలీసుశాఖల్లోనే ఈ పరిస్థితి ఎక్కువగా కనిపించడం మరింత ఆందోళన కనిపిస్తోంది. అవినీతికి అవకాశాలు తక్కువగా ఉండే విద్య, వైద్యం, విద్యుత్ శాఖల్లోనూ లంచం వ్యవస్థ క్రమంగా వేళ్లూనుకుంటోంది. పాలనలో ప్రజలకు దగ్గరగా ఉండే శాఖలు పంచాయతీరాజ్, మండల, జిల్లా పరిషత్, వ్యవసాయ శాఖలు, నిర్మాణాత్మకంగా ప్రజలకు వసతులు కల్పించే నీటిపారుదల, రహదారులు భవనాలు, ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగాలు, ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం పనిచేసే ఐసీడీఎస్, వైద్య శాఖలకు సైతం కొంతమంది అధికారులు, సిబ్బందితో చెడ్డపేరు వస్తోంది.

పట్టా రావాలంటే ముట్టాల్సిందే..

'ధరణి'.. రెవెన్యూ శాఖలో అవినీతి తగ్గించడానికి తెచ్చిన కొత్త పోర్టల్. తహసీల్దార్ కార్యాలయాలలో అవినీతి రూపుమాపేందుకు ఉపయోగపడకపోగా.. రైతులకు అదనపు భారంగా మారింది. గతంలో అధికారులకు కొంత ముట్టజెప్పితే పనులు పూర్తయ్యేవి. ఇప్పుడు ధరణి ఫీజులతో పాటు అధికారులకు ముట్ట చెప్పాల్సి వస్తోంది. భూమి పత్రాలు పొందడానికి వేలు, లక్షల రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. ఈ వ్యవహారమంతా బహిరంగంగానే జరుగుతోంది. చింతలమానెపల్లి తహసీల్దార్‌పై గతంలో ఓ సర్పంచ్ నేరుగా ఆరోపణలు చేసినా చర్యలు మాత్రం చేపట్టలేదు. చింతలమానెపల్లిలోనే నలుగురు తహసీల్దార్లు అవినీతి ఆరోపణలపై వేటుకు గురికావడం గమనార్హం. విద్యార్థులు, అభ్యర్థులు, లబ్ధిదారుల కుల, ఆదాయ, జనన, మరణ ధృవీకరణ పత్రాలకు సైతం కొన్ని కార్యాలయాలలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

స్టేషన్ బెయిల్.. బెదిరింపులకు మార్గం

జిల్లాలో తరచూ పోలీసుశాఖపై అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. గతేడాది నవంబర్‌లో చింతలమానెపల్లి ఎస్సై వెంకటేశ్, తాజాగా ఆసిఫాబాద్‌లో ఎస్సైగా పని చేస్తున్న రాజ్యలక్ష్మి ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే. ఇద్దరూ కూడా కేసు నమోదు చేయడకుండా స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి డబ్బులు డిమాండ్ చేయడం గమనార్హం. ఐదేళ్లలోపు శిక్షలు పడే కేసుల్లో రిమాండ్‌కు తరలించకుండా అరెస్టు చేయవద్దని కోర్టులు సూచిస్తున్నాయి. తీవ్రమైన నేరాలకు పాల్పడకుండా తక్కువ శిక్ష పడే కేసుల్లోనూ స్టేషన్ బెయిల్ ఇవ్వాలనే నిబంధనలు ఉన్నాయి. నిందితులకు 41 సీఆర్‌పీసీ నోటీసులు ఇచ్చి బెయిల్ ఇచ్చేందుకు ఎస్‌హెచ్‌ఓలకు అధికారాలను కల్పించారు. దీనిని కొంతమంది పోలీసులు ఆదాయ మార్గంగా ఎంచుకున్నారు. స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా ఎస్సై కిందిస్థాయి సిబ్బంది ట్యాబ్‌లతో రహదారులపై తిరుగుతూ మామూళ్లు వసూలు చేయడం పరిపాటిగా మారింది.

అవగాహన లేకనే..

లంచం డిమాండ్ చేసినా.. డబ్బుల కోసం వేధించినా సమాచారం అందించాలని ఏసీబీ అధికారులు సూచిస్తున్నారు. లంచం తీసుకుంటూ పట్టుబడిన సందర్భాల్లో ప్రచారం చేస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కొరవడుతోంది. లంచం కోసం వేధించినా ఏసీబీని ఆశ్రయించడానికి బాధితుల వద్ద పూర్తిస్థాయి సమాచారం ఉండడం లేదు. కేసు నమోదైనా ఘటనలు మాత్రం తగ్గడం లేదు. లంచం రాకాసిని రూపుమాపేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు అవగాహన చర్యలు చేపట్టాలని, అధికారిక శాఖల్లో సైతం కౌన్సెలింగ్ నిర్వహించాలనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

విద్యాశాఖలోనూ అంతే..

విద్యార్థులకు సంస్కారం నేర్పాల్సిన విద్యాశాఖ సైతం అవినీతి బాట పడుతోంది. స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో పనిచేసే ఉపాధ్యాయులు సెలవులు వినియోగించకుండా ఓడీ(ఆన్‌డ్యూటీ) పేరుతో విధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆ శాఖ ఉద్యోగులే ఆరోపిస్తున్నారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంకు ఒక ఓడీకి రూ.500 చెల్లిస్తే సరిపోతుందని అంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఉపాధ్యాయులు దీనిని వినియోగించుకుంటున్నారు. అక్రమంగా డిప్యుటేషన్లు, పాఠశాల నిధుల దుర్వినియోగం సైతం ఎక్కువే.. సిర్పూర్ నియోజకవర్గంలోని ఒక శాశ్వత విద్యాధికారికి మందుబాటిల్ ఇస్తే ఏ పనైనా జరిగిపోతుందని స్థానికంగా సిబ్బంది మాట్లాడుకుంటున్నారు. ఇలా అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద దళారులను ఏర్పాటు చేసుకుని మరీ వసూళ్లు సాగిస్తున్నారు.

చేయి తడిపితేనే బిల్లులు..!

ఇటీవల గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ కింద సుమారుగా రూ.3లక్షల నుంచి 5లక్షల విలువ చేసే రహదారులను నిర్మించారు. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేక చాలా చోట్ల నాసిరకంగానే పనులు చేపట్టారు. ఫిర్యాదులు ఎక్కువగా రావడంతో ఉన్నతాధికారులు రహదారులను పరిశీలించారు. సదరు గుత్తేదార్లు తలా కొంత ముట్టజెప్పి తప్పించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మామూళ్లు ఇచ్చినా బిల్లులు మాత్రం రాలేదని గుత్తేదార్లు వాపోతున్నారు. నీటిపారుదల, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, సర్వశిక్ష అభియాన్, ఆరోగ్యశాఖ శాఖల పరిధిలో ఇంజినీరింగ్ అధికారులకు చేయి తడిపితేనే బిల్లులు వస్తాయని బహిరంగంగానే చెప్తుంటారు.

పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- అధికారులతో సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లాలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పంచాయతీ అధికారులు, మున్సిపల్ అధికారులతో పారిశుధ్య నిర్వహణపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం చెత్త సేకరణపై మైకుల ద్వారా తెలియజేస్తూ.. ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని ఆదేశించారు. తడి, పొడి చెత్త సేకరణ కోసం ట్రాక్టర్లు, ఆటోలు వినియోగించాలని, అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. పరిశుభ్రతపై ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. సమన్వయంతో పని చేసి తాగునీటి సరఫరా లేని ప్రాంతాలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని అందించాలన్నారు. సమావేశంలో డీపీవో భిక్షపతి, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు చేపట్టాలి

జిల్లాలోని చెరువులు, కుంటలు, కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నీటిపారుదల, ఇంజనీరింగ్ అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల నిర్మాణం, నీటిపారుదల ప్రాజెక్టుల్లో నీటి మట్టం, పెండింగ్ పనులపై దృష్టి సారించాలన్నారు. సాగునీటి లభ్యతపై వ్యవసాయ శాఖ అధికారులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద నీటిపారుదల శాఖ అధికారులు తమ శాఖ పరిధిలోని అభివృద్ధి పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. టీఏలు, ఎఫ్ఏల సమన్వయంతో నూతన కాల్వల నిర్మాణం, పూడిక తీత, పిచ్చి మొక్కల తొలగింపు, లైనింగ్ పనులు చేపట్టాలని ఆదేశించారు. మే నెల మొత్తం తాగునీటి పారుదలకు సంబంధించిన పనులు నిర్వహించాలన్నారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ఈఈలు గుణవంత్‌రావు, ప్రభాకర్, డీఈఈలు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీసు స్టేషన్‌ను శనివారం తనిఖీ చేశారు. సిబ్బంది విధుల గురించి అడిగి తెలుసుకుని, కేసులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. స్టేషన్‌లో సీసీటీఎన్ఎస్‌లోని ఎఫ్ఐఆర్, చార్జిషీట్, మీసేవ, హెచ్ఆర్ఎంఎస్ అన్ని అప్లికేషన్లపై ఆరా తీశారు. ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ఉంటూ, వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. నిషేధిత మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి సాగు చేసినా.. రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడిన వారికి సైబర్ వారియర్స్ ద్వారా వేగంగా న్యాయం చేయాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తతతో ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ సతీశ్, ఎస్సై ప్రవీణ్ సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రశ్నించే గొంతుకలను అణగదొక్కే ప్రయత్నం'



పుస్తకం ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: దేశంలో ప్రశ్నించే గొంతుకలను అణగదొక్కే ప్రయత్నం జరుగుతుందని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవికుమార్ అన్నారు. ప్రబీర్ పుర్కాయస్థ ఇంగ్లిష్‌లో రచించిన పుస్తకాన్ని బొడుపట్ల రవీందర్ తెలుగులోకి 'అలుపెరుగని పోరాటం' పేరుతో అనువదించగా.. జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో శనివారం కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆవిష్కరించారు. రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపుతున్న ప్రబీర్ పుర్కాయస్థపై ఉపా కేసు పెట్టి అరెస్టు చేయడం దారుణమన్నారు. 70 ఏళ్ల వయసులోనూ ఆయన ప్రభుత్వానికి లొంగకుండా జైలులో ఉన్నారని, ఆయనకు మద్దతుగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఉపా చట్టాన్ని వినియోగించుకుని కేంద్ర ప్రభుత్వం కేసులు పెట్టడం ఆపాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి మహేశ్ 'పాటనే నేనవుతా' అంటూ ఆలపించిన గీతం ఆకట్టుకుంది. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు టీకానంద్, కార్తీక్, రాజన్న, మారుతీ పటేల్, శ్రీనివాస్, సాయిరాం, తిరుపతి, ఆనంద్, రాజన్న, రవీందర్, చిప్ప సురేశ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో నిరుపేద దివ్యాంగులకు డీఎస్సీ, గ్రూప్స్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారి భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అణచివేతకు గురైన, తల్లిదండ్రులు లేని, నిరుపేద కుటుంబాలకు చెందిన దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సాంకేతిక శిక్షణ సంస్థలో ఉచిత కోచింగ్‌తోపాటు వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. అర్హత, ఆసక్తి గల వారు ఈ నెల 25లోగా జిల్లా కేంద్రంలోని జిల్లా సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94914 60658 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అమరులకు జోహార్లు



న్యాయమైన హక్కుల కోసం ఇంద్రవెల్లి వేదికగా పోరాడి అమరులైన వారికి ఆదివాసీలు ఘన నివాళులర్పించారు. ఇంద్రవెల్లి స్తూపం వద్ద శనివారం అమరుల సంస్మరణ దినం నిర్వహించారు. అధికారికంగా అనుమతి లేకపోయినా ఎలాంటి ఆంక్షలు విధించకపోవడంతో ఆదివాసీ సంఘాల నాయకులు, కుల పెద్దలు, అమరుల కుటుంబ సభ్యులు హాజరై సంప్రదాయ పూజలు చేశారు.

- వివరాలు 8లో▸

క్లుప్తంగా

హరితహారం మొక్కలు అగ్నికి ఆహుతి



పెద్దంపేట-దొనబండ దారిలో కాలిన పచ్చని చెట్లు

భీమిని/మంచిర్యాలరూరల్(హాజీపూర్): హరితహారంలో రోడ్డుకు ఇరువైపుల నాటిన మొక్కలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. భీమిని మండలం టేకులపల్లి నుంచి కన్నెపల్లి వరకు ప్రధాన రహదారిపై రెండు వైపుల హరితహారం మొక్కలు కాలిపోతున్నాయి. పంట చేళ్ల గట్లపై పిచ్చిమొక్కలు, పత్తి కట్టె కాలబెట్టడంతో మొక్కలూ అంటుకుంటున్నాయి. హాజీపూర్ మండలం బుద్దిపల్లి గ్రామ పంచాయతీ పరిధి పెద్దంపేట-దొనబండ గ్రామాలకు వెళ్లే రహదారిపై, పడ్తనపల్లి గ్రామ శివారులో హరితహారం చెట్లు శనివారం కాలిబూడిదయ్యాయి.

నాణ్యమైన పనిముట్లు సరఫరా చేయాలి



మాట్లాడుతున్న సీతారామయ్య

బెల్లంపల్లి: బొగ్గు గనుల్లో నాణ్యమైన పనిముట్లను సరఫరా చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శనివారం మందమర్రి ఏరియా శాంతిఖని గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రొడక్షన్ హాంపరింగ్ జరగకుండా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. నాణ్యత కలిగిన బెల్ట్‌లను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై చూపిస్తున్న శ్రద్ధాసక్తులు సౌకర్యాల కల్పనలో విస్మరించడం సరికాదని, కార్మికులు తగిన సదుపాయాలు లేక విధి నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. శాంతిఖని గనిలో మ్యాన్ రైడింగ్‌ను మరింతగా విస్తరించేందుకు చర్యలు తీసుకుని నడకభారం తగ్గించాలని అన్నారు. అనంతరం పలువురు కార్మికులు ఏఐటీయూసీలో చేరగా సీతారామయ్య కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య, మందమర్రి ఏరియా బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, శాంతిఖని ఫిట్ సెక్రెటరీ దాసరి తిరుపతిగౌడ్, అసిస్టెంట్ సెక్రెటరీ మంతెన రమేష్, ఉపాధ్యక్షుడు ప్రశాంత్, నాయకులు బొంకూరి రాంచందర్,రత్నం ఐలయ్య, మిట్టపల్లి రమేష్, స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఇంచార్జీగా నీలకంఠేశ్వర్‌రావు

పాతమంచిర్యాల: కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ ఇంచార్జీగా జిల్లా చెందిన డాక్టర్ నీలకంఠేశ్వర్‌ను నియామకం చేసినట్లు ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జీ తవాడే శనివారం ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో నియామకం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి జితేందర్ ఉన్నారు.

అమరులకు జోహార్లు

- ఇంద్రవెల్లి స్తూపం వద్ద నివాళులర్పించిన మంత్రి సీతక్క
- ఎంపీ సోయం, ఎమ్మెల్యేలు బొజ్జు, అనిల్ జాదవ్, శంకర్
- తరలివచ్చిన ఆదివాసీలు.. ప్రత్యేక పూజలు



నివాళులు అర్పిస్తున్న మంత్రి సీతక్క, వెడ్మ బొజ్జు



స్మారక జెండా వద్ద మొక్కుతున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: తమ న్యాయమైన హక్కుల సాధన కోసం నాడు ఇంద్రవెల్లి వేదికగా పోరాడి అమరులైన వారికి జోహర్లంటూ ఆదివాసీలు శనివారం ఘన నివాళులర్పించారు. అమరుల సంస్మరణ దినం సందర్భంగా ఇంద్రవెల్లి స్తూపం వద్ద శనివారం నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి సీతక్కతో పాటు ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, అనిల్‌జాదవ్, పాయల్ శంకర్, జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న తదితరులు వేర్వేరుగా హాజరయ్యారు. కార్యక్రమానికి అధికారికంగా అనుమతి లేకపోయినా ఎలాంటి ఆంక్షలు విధించకపోవడంతో ఆదివాసీ సంఘాల నాయకులు, కుల పెద్దలు, అమరుల కుటుంబ సభ్యులు హాజరై సంప్రదాయ పూజలు చేశారు. ముందుగా మండలకేంద్రంలోని గోండ్‌గూడ నుంచి సంప్రదాయ వాయిద్యాల మధ్య స్తూపం వద్దకు చేరుకున్నారు. దేవరి చహకటి నాగోరావ్ ఆధ్వర్యంలో పూజలు చేసి జెండా ఆవిష్కరించారు. అమరులకు నివాళులర్పించిన అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటున్నామన్నారు. ఇప్పటికే ఇంటి స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామన్నారు. అనంతరం ఆదివాసీ నాయక్ పోడ్ హక్కుల పరిరక్షణ కమిటీ లోగోను మంత్రి ఆవిష్కరించారు. ఎంపీ సోయం బాపూరావు మాట్లాడుతూ, ఆదివాసీల న్యాయమైన హక్కుల సాధన కోసం పార్టీలకతీతంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. స్తూపం అభివృద్ధి చేయాలని కోరుతూ మంత్రికి ఎర్రజెండా ఆశయసాధన కమిటీ అధ్యక్షుడు తొడసం నాగోరావు, సభ్యులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమాల్లో ఆదివాసీ నాయక్‌పోడ్ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గంజి రాజన్న, జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, బీజేపీ నాయకులు మరప రాజు, ఆరెల్లి రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులతో బందోబస్తు



సంప్రదాయ వాయిద్యాలతో అమరుల స్తూపం వద్దకు వస్తున్న ఆదివాసీలు

సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ నాగేందర్ ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, ఏడుగురు ఎస్సైలతో పాటు 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ సోయం బాపూరావు



అమరులకు నివాళులర్పిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న



అమరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి

రెబ్బెన(ఆసిఫాబాద్): కార్మిక సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతామని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని కేఎల్ మహేంద్రభవన్‌లో శనివారం సాయంత్రం ఏరియా వర్క్‌షాప్, ఏరియా స్టోర్స్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి గుర్తింపు ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కంపెనీలో రోజురోజుకు రాజకీయ జోక్యం పెరుగుతోందని, ప్రతీ విషయాన్ని రాజకీయ కోణంతో చూస్తున్నారని పేర్కొన్నారు. వివిధ యూనియన్లకు చెందిన నాయకులు ఏఐటీయూసీలో చేరగా.. వారికి కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఏరియా వర్క్‌షాప్ ఫిట్ కార్యదర్శిగా అశోక్, స్టోర్స్ ఫిట్ కార్యదర్శిగా గురజాల రమేశ్‌ను ఎంపిక చేశామని తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచి ఆర్గనైజింగ్ కార్యదర్శులు రాజేశ్, చంద్రశేఖర్, ఆనంద్, నాయకులు ఇంతియాజ్, వసీం పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు



వాహనం తనిఖీ చేస్తున్న ఎస్సై శ్యాంపటేల్

వేమనపల్లి: మండలంలోని మంగెనపల్లి క్రాస్ రోడ్డు నీల్వాయి ప్రధాన రహదారిపై ఎస్సై శ్యాంపటేల్ ఆధ్వర్యంలో శనివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో వాహనాల్లో తీసుకెళ్లే సరుకులను పరిశీలించారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఏమైనా ఉచిత వస్తువులు, నగదు సరఫరా చేస్తున్నారా అని ఆరా తీశారు. అపరిచిత, అనుమానిత వ్యక్తులను వాహనాల్లో ఎక్కించుకోకూడదని సూచించారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు తారసపడితే సమాచారం అందించాలని తెలిపారు.

వేధింపులు మానుకోవాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న పేరం రమేశ్

శ్రీరాంపూర్: కంపెనీ అధికారులు తనను వేధించడం మానుకోవాలని ఆర్కే 6 గని ఎలక్ట్రీషియన్, ఐఎన్టీయూసీ నాయకుడు పేరం రమేశ్ శనివారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశాడు. ప్లకార్డుతో కొందరు అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశాడు. 2019లో నస్పూర్ కాలనీలోని వేంకటేశ్వర అలయం ప్రాంగణంలో దుకాణ సముదాయాల నిర్మాణాలకు సంబంధించిన ఓ వివాదంలో తనకు అప్పుడు కంపెనీ అధికారులు చార్జీషీట్ ఇచ్చారని, వెంటనే సమాధానం ఇచ్చానని పేర్కొన్నాడు. 2021లో తనకు ప్రమోషన్ రావాల్సి ఉండగా చార్జీషీటును అడ్డు చూపుతూ ఇవ్వడం లేదన్నాడు. ఇదేమని తాను ప్రశ్నిస్తే అధికారులు కక్ష సాధింపు చర్యలు, బెదిరింపులకు పాల్పడుతన్నారని ఆరోపించాడు. సమస్యపై చర్చిద్దామని జీఎం కోరడంతో ఆందోళన విరమించాడు. జరిగిన ఘటనలు, కేసు పూర్వపరాలను విచారించి త్వరలోనే వివాదాన్ని పరిష్కరిస్తామని జీఎం సంజీవరెడ్డి తెలిపారు. కాగా, ఇద్దరు అధికారులపై నిందారోపణలు చేస్తూ ప్లకార్డులు పట్టుకుని కంపెనీ నిబంధనలకు వ్యతిరేకంగా ఉద్యోగి బైఠాయించి నినాదాలు చేయడాన్ని సింగరేణి అధికారులు సంఘం శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో ఖండించారు.

ఫుట్‌బాల్ పోటీల విజేత హైదరాబాద్



ట్రోఫీ, చెక్కు అందిస్తున్న జీఎం రవిప్రసాద్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి ఆధ్వర్యంలో రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో ఈ నెల 18న ప్రారంభమైన వేణుగోపాల్ మెమోరియల్ ఇన్విటేషన్ ఫుట్‌బాల్ పోటీలు శనివారం ముగిశాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో హైదరాబాద్ జట్టు విజయం సాధించగా.. సోమగూడెం జట్టు రన్నరప్‌గా నిలిచింది. సాయంత్రం స్టేడియంలో ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవానికి బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జీఎం మాట్లాడుతూ ఏటా సింగరేణి ఆధ్వర్యంలో వేణుగోపాల్ మెమోరియల్ ఇన్విటేషన్ టోర్నమెంట్ ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు తరలివచ్చి పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. పోటీల్లో గెలుపోటములు ఉంటాయని, వాటిని సమానంగా స్వీకరించడమే క్రీడాస్ఫూర్తికి నిదర్శనమన్నారు. అనంతరం విన్నర్‌గా నిలిచిన హైదరాబాద్ జట్టుకు రూ.50వేల నగదుతో పాటు ట్రోఫీ, రన్నరప్‌గా నిలిచిన సోమగూడెం జట్టుకు రూ.30వేల నగదు, ట్రోఫీ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, రిటైర్డ్ జీఎం పర్సనల్ ఆనంద్‌రావు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సివిల్ ఎస్ఈ బాషా, సీనియర్ పీవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం'



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

కోటపల్లి: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమైందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎర్రబెల్లి రఘునాథ్ అన్నారు. శనివారం స్థానికంగా మండల బూత్ అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గంలో కుటుంబపాలన కొనసాగుతోందని, ఎమ్మెల్యే ఎమ్మెల్యే వివేక్ గెలిచిన వెంటనే నలభై వేల ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేశారని, అధికారంలోకి వచ్చిన తర్వాత కొడుకు ఉద్యోగం కోసం ఢిల్లీ నుంచి నాయకుల దాకా కొనుగోలు పర్వానికి తెరతీశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి సురేఖ, రామయ్య, ఎంపీటీసీ సంగీత, నాయకులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, అశోక్, రమేశ్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల వేట ప్రాణం తీసింది..

- అడవి పందుల కోసం విద్యుత్ తీగలతో ఉచ్చు
- అతడు అమర్చిన తీగలే తగిలి వ్యక్తి మృతి



విద్యుత్ తీగల ఉచ్చుకు బలైన కుక్క



సంద్ర ప్రకాష్ మృతదేహం

నెన్నెల: వన్యప్రాణుల వేట ఓ వ్యక్తి ప్రాణం తీసింది. అడవి పందుల కోసం మామిడితోట చుట్టూ విద్యుత్ తీగల కంచె అమర్చి.. అవే తీగలతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని బొప్పారం గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన సంద్ర ప్రకాష్, లక్ష్మి దంపతులు బొప్పారం శివారులోని మామిడితోటలో కాపలా ఉంటున్నారు. తోటలోకి అడవి పందులు వస్తున్నాయని ప్రకాష్ శుక్రవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద 11కేవీ విద్యుత్ లైన్‌కు బైండింగ్ వైర్‌తో కొక్కిలు వేసి తోట చుట్టూ అమర్చాడు. శనివారం తెల్లవారుజామున కొక్కిలు తొలగించే క్రమంలో ఆందోళనకు గురై తాను అమర్చిన విద్యుత్ తీగలు తనకే తగలడంతో ప్రకాష్(56) విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కొద్ది దూరంలో అతడి పెంపుడు కుక్క సైతం విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో చనిపోయింది. ఎస్సై ప్రసాద్, విద్యుత్ ఏఈ మల్లయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

గాల్లో కలుస్తున్న ప్రాణాలు

వేటగాళ్లు అమరుస్తున్న విద్యుత్ తీగలతో మనుషులు, మూగజీవాల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. గతేడాది చిత్తాపూర్ గ్రామ శివారులో చెరువు వద్ద వన్యప్రాణుల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలకు రెండు ఎడ్లు మృతిచెందాయి. దమ్మిరెడ్డిపేట గ్రామ శివారులో వేటగాళ్ల విద్యుత్ తీగల ఉచ్చుకు ఎలుగుబంటి చనిపోయింది. నార్వాయిపేటలో సంవత్సరం క్రితం వేటకు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి రైతు లావుడియా హట్టి బలయ్యాడు. రెండేళ్ల క్రితం కోణంపేట అడవిలో వేటకు అమర్చిన విద్యుత్ వైర్లు తగిలి జజ్జరవెల్లికి చెందిన రైతు మడుగూరి శ్రీనివాస్ మృతిచెందాడు. చిత్తాపూర్, జోగాపూర్ అటవీ ప్రాంతంలో పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తుండగా వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి స్పెషల్ బ్యాచ్ పోలీసు కిందపడిపోయి తీవ్ర గాయాలతో బతికి బయటపడ్డాడు. ఇలాంటి సంఘటనలు కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో జరుగుతున్నాయి. వన్యప్రాణుల వేట కోసం విద్యుత్ తీగలు అమర్చే వేటగాళ్లపై అధికారులు దృష్టి సారించకపోవడంతో యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.

ప్రాణహిత తీరం వెంట హెలికాప్టర్ చక్కర్లు

వేమనపల్లి: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దు గ్రామాల ప్రాణహిత తీరం వెంట ఇరు రాష్ట్రాల పోలీసు సిబ్బంది నిఘా తీవ్రతరం చేశారు. ఇటీవల తీరం వెంట హెలికాప్టర్ల సంచారం గుబులు రేపుతోంది. మహారాష్ట్రలోని అహేరి, సిరోంచ తాలూకాల పరిధిలో ఆదివాసీ సరిహద్దు గ్రామాలు ఎక్కువగా ఉన్నాయి. మొదటి దశలో ఎన్నికలు ముగియగా సరిహద్దు గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశారు. గత రెండు రోజుల క్రితం మూడు హెలికాప్టర్లతో తీరం వెంట ఉన్న పోలీస్‌స్టేషన్ల నుంచి సీఆర్పీఎఫ్, సీ-60 పోలీసు బలగాలను తరలించారు.శనివారం ప్రాణహిత తీరం వెంట రేగుంట పోలీస్‌స్టేషన్ వైపు వచ్చిన హెలికాప్టర్ సీఆర్పీఎఫ్ పోలీసులను అహేరి పోలీసు సబ్‌డివిజన్ ఆఫీస్‌కు తరలించినట్లు తెలుస్తోంది. వరుస హెలికాప్టర్ల సంచారంతో సరిహద్దు గ్రామాల్లో ఆందోళనలు రేకెత్తిస్తోంది.

ఉద్యోగులు క్రీడల్లో రాణించాలి

శ్రీరాంపూర్: కంపెనీ ఉద్యోగుల క్రీడల్లో రాణించాలని ఆర్కే 6 గని మేనేజర్ ఈ.తిరుపతి తెలిపారు. ఈ నెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్ని రిలేల ఉద్యోగులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతగా నిలిచిన బీ రిలే టీంకు శనివారం గనిపై జరిగిన కార్యక్రమంలో ట్రోఫీని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు క్రీడాస్ఫూర్తిని చాటారన్నారు. ఆటలు ఆడటం వల్ల కొత్త సంబంధాలు చిగురిస్తాయని, పోటీ తత్వం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గని రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, ఇంజనీర్ మహేశ్, అండర్ మేనేజర్ ప్రశాంత్, అధికారులు, యూనియన్ నేతలు పాల్గొన్నారు.

కూతురు పెళ్లి పనులకు వెళ్తూ తండ్రి మృతి

- నేడు జరగాల్సిన వివాహం
- విషాదంలో కుటుంబం



కమలకర్‌రావ్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: ఒక్క రోజు గడిస్తే కూతురు పెళ్లి.. అంగరంగ వైభవంగా పెళ్లి జరిపించి కూతురిని అత్తారింటికి పంపించాలని భావించాడు. పెళ్లి పనుల నిమిత్తం మార్కెట్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదం అతడి కలలను కల్లలు చేసింది. పెళ్లింట విషాదం మిగిల్చింది. ఈ సంఘటన జిల్లా కేంద్రం మంచిర్యాలలోని ఏసీసీలో చోటు చేసుకుంది. ఎస్సై లక్ష్మణ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఏసీసీలో నివాసం ఉంటున్న ఏపూరి కమలకర్‌రావు జైపూర్ పవర్‌ప్లాంటులో కాంట్రాక్ట్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు భార్య సరిత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు సౌమ్య వివాహం ఈ నెల 21న ఉదయం 10గంటలకు జరగాల్సి ఉంది. వివాహ పనుల నిమిత్తం శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై మార్కెట్‌కు వెళ్తుండగా లక్ష్మి టాకీస్ వద్ద రోడ్డుపై ఉన్న బర్రెను తప్పించబోయి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే కమలకర్‌రావు(48) మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అతడి మరణంతో పెళ్లింట విషాదం నెలకొంది. "నాన్న నేనేమి పాపం చేశాను నా పెళ్లి చేయకుండానే శాశ్వతంగా మమ్మల్ని వదిలి వెళ్లిపోయావా.." అంటూ కూతురు రోదించడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది.

పనులు అడ్డుకున్నారని ఎఫ్‌బీవో ఘెరావ్



మారెపల్లి ఒర్రె వద్ద చెట్టు నీడలో ఎఫ్‌బీవో శ్రీనివాస్‌తో ప్రజలు

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి మండలం మారెపల్లి సమీపంలోని ఒర్రెపై చేపడుతున్న వంతెన నిర్మాణ పనులను అడ్డుకునేందుకు వెళ్లిన ఫారెస్ట్ బీట్ అధికారి శ్రీనివాస్‌ను వివిధ గ్రామాల ప్రజలు ఘెరావ్ చేశారు. ఖమాన నుంచి సర్కెపల్లి వరకు మూడేళ్ల క్రితం బీటీ రోడ్డు మంజూరైంది. మారెపల్లి వరకు పనులు పూర్తి కాగా అక్కడి నుంచి సర్కెపల్లి వరకు 3 కిలోమీటర్లు అటవీ అనుమతులు లేక నిలిచిపోయాయి. మారెపల్లి వద్ద ఉన్న ఒర్రెపై వంతెన నిర్మించేందుకు కాంట్రాక్టర్ ఇసుక, కంకరను శుక్రవారం రాత్రి ఒర్రె వద్దకు తరలించారు. శనివారం వంతెన పనులు ప్రారంభించాల్సి ఉండగా.. సర్కెపల్లి ఎఫ్‌బీవో శ్రీనివాస్ అక్కడికి చేరుకున్నారు. ఈ ప్రాంతం అటవీ ప్రాంతంలోకి వస్తుందని, రహదారులు, వంతెనల నిర్మాణానికి అనుమతి అవసరం ఉంటుందని పనులను అడ్డుకున్నారు. దీంతో మారెపల్లి, సర్కెపల్లి, పాక్డిగూడ, ఆలిగూడ గ్రామాల ప్రజలు అక్కడికి చేరుకుని ఆందోళనకు దిగారు. ఏళ్లుగా అనుమతుల పేరుతో పనులు జరగకుండా ఆపడం జమంజసం కాదని వాదించారు. ఉన్నతాధికారులు వచ్చి అనుమతులు ఇచ్చే వరకు ఇక్కడే ఉండాలని ఎఫ్‌బీవోను చుట్టుముట్టి చెట్టు కింద కూర్చోబెట్టుకున్నారు. డీఆర్వో సరోజరాణి, ఎఫ్ఎస్‌వో లక్ష్మణ్ అక్కడికి చేరుకుని వారిని సముదాయించారు. అనుమతులు వచ్చేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.